ముమ్మరంగా వాహనాల తనిఖీ



బంజారాహిల్స్: ఎన్నికల ప్రచారానికి మంగళవారం తెరపడటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు మద్యం, నగదు పంపిణీ చేసే అవకాశం ఉండటంతో ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది రంగంలోకి దిగారు. మంగళవారం ఉదయం నుంచే వేర్వేరుచోట్ల వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. భారీగా మద్యం పంపిణీ జరగనుందని సమాచారం రావడంతో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో తనిఖీలు చేపట్టారు. పలుచోట్ల ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది గల్లీలు, అపార్ట్‌మెంట్ల వద్ద తిష్టవేసి నగదు పంపిణీని అరికట్టేందుకు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

యువతికి వేధింపులు

సైబర్ క్రైం పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

హిమాయత్‌నగర్: సోషల్ మీడియా వేదికగా ఓ యువతిని వేధిస్తున్న వ్యక్తిపై నగర సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. సైబర్ క్రైం ఏసీపీ శివ మారుతి సమాచారం మేరకు... నగరానికి చెందిన ఓ యువతికి సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా ఓ వ్యక్తి పరిచయం అయ్యాండు. యువతి ఫొటోలను అసభ్యకరంగా సృష్టించి సోషల్ మీడియాలో వైరల్ చేస్తానంటూ బెదిరించాడు. తాను చెప్పినట్లు వినకపోతే ఆ ఫొటోలను వివిధ సోషల్ మీడియా వేదికల్లో పెట్టి వైరల్ చేస్తానంటూ బెదిరించాడు. దీంతో బాధితురాలు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

258 పోలింగ్ బూత్‌లు
119 లొకేషన్లు



- డీఆర్‌సీ సెంటర్‌లో పోలింగ్ సామగ్రి కోసం 25 కౌంటర్లు
- మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత సెక్టోరియల్ అధికారులదే...
- సమన్వయం కోసం అధికారులతో కూడిన వాట్సాప్ గ్రూప్
- సమన్వయ సమావేశంలో ఖైరతాబాద్ ఆర్వో వెంకటేష్ ధోత్రే



మాట్లాడుతున్న ఖైరతాబాద్ ఆర్వో వెంకటేష్ ధోత్రే... పరిశీలకులు జయకాంతన్

బంజారాహిల్స్: ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకమని ఖైరతాబాద్ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి వెంకటేష్ ధోత్రే అన్నారు. ఈ నెల 30న జరగనున్న పోలింగ్‌కు సంబంధించి మంగళవారం యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన డీఆర్‌సీ సెంటర్‌లో నియోజకవర్గ జనరల్ అబ్జర్వర్ జయకాంతన్‌తో కలిసి సెక్టోరియల్ అధికారులు, రూట్ అధికారుల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోలింగ్ స్టేషన్లపై సెక్టోరియల్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.

- మంగళ, బుధ వారాల్లో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు సరిచూసుకొని ఏవైనా సమస్యలుంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. నిబంధనల ప్రకారం నిర్దేశించిన వసతులను మంగళవారం సాయంత్రంలోగా కల్పించాలన్నారు. కేంద్రాల్లో ఎలాంటి రాతలు ఉండకూడదని వంద మీటర్ల పరిధిలో రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టర్లు, సామగ్రి ఉండకుండా పర్యవేక్షించాలన్నారు.
- పోలింగ్ అధికారులకు సామగ్రి పంపిణీ, సెక్యూరిటీతో ఈవీఎంలు, వీవీ ప్యాట్లు కేటాయించిన వాహనాల్లో ఆయా పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరాలన్నారు. ఈ నెల 30న ఉదయం 4 గంటలకు ఈవీఎం, వీవీ ప్యాట్లు ఆయా కేంద్రాలకు చేరాలని ఉదయం 5.30 గంటలకు ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోల్ ప్రారంభం కావాలన్నారు. మాక్ పోల్ పూర్తయిన తర్వాత సదరు పత్రాలపై సంతకాలు చేయాలని వాటికి సంబంధించిన వివరాలు వెల్లడించారు.
- కేంద్రాల్లో ర్యాంపులు, టాయిలెట్లు, సరిగ్గా ఉండాలని దుర్వాసనలు, వ్యర్థాలు పేరుకుపోతే పారిశుద్ధ్య విభాగ సిబ్బందితో కలిసి పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.
- పారిశుద్ధ్య విభాగం ఇంజినీర్లు, పోలీసులు, ఎలక్ట్రిసిటీ సిబ్బందితో కలిసి ఒక వాట్సాప్ గ్రూపును కూడా క్రియేట్ చేస్తామన్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి ఓటింగ్‌శాతం కోసం ఏర్పాటు చేసిన మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు.
- ఖైరతాబాద్ నియోజకవర్గంలో మాత్రమే క్యూ యాప్‌ను అమలు చేస్తున్నామని ఎప్పటికప్పుడు లైన్‌లో ఎంతమంది ఓటర్లు లైన్‌లో ఉన్నారో ఈ యాప్‌లో నమోదు చేయాలన్నారు. సెక్టోరియల్ అధికారులు పోలింగ్ సిబ్బంది, రూట్ ఆఫీసర్లు, సమన్వయంగా ముందుకు సాగాలని సూచించారు.
- ఫుడ్‌పాయింట్లు కూడా ఏర్పాటు చేశామని సిబ్బందికి ఫుడ్ అందించే బాధ్యత సెక్టోరియల్ అధికారులదేనని అన్నారు. నియోజకవర్గంలో 258 పోలింగ్ బూత్‌లు ఉండగా ఇవి 119 లొకేషన్లలో ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.
- ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి తీసుకునేందుకు డీఆర్‌సీ సెంటర్‌లో 25 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగుస్తుందని ఆ సమయంలో గేటులోపల ఎంత మంది ఉంటే అంత మంది ఓటు హక్కు వినియోగించుకునేలా చూసే బాధ్యత సెక్టోరియల్ అధికారులదేనని అని ఆయన స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌కు మద్దతు కోసం...



సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రెడ్డి సామాజిక వర్గం మద్దతు కోసం కర్ణాటక మంత్రి రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి రంగంలో దిగారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని పీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డిలో నివాసంలో వివిధ రెడ్డి సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. సంఘాల ప్రతినిధులు తీగల మోహన్‌రెడ్డి, నరసింహారెడి, పాండురంగారెడి, ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల్లో నూతనోత్సాహం



బీజేపీ నాయకులను అభినందిస్తున్న ప్రధాని మోదీ, చిత్రంలో కేశబోయిన శ్రీధర్

హిమాయత్‌నగర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నగరంలో జరిగిన ప్రధాని నరేంద్రమోదీ రోడ్ షోతో బీజేపీ నేతల్లో సరికొత్త ఉత్సాహం నింపారని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ మంగళవారం తెలిపారు. రోడ్‌షోలో భాగంగా కాచిగూడ సిగ్నల్స్ వద్ద వీర్ సావర్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మోదీ నగర పార్టీ నేతలను కలవడం ఆనందంగా ఉందన్నారు. మోదీ పర్యటనతో రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు. ప్రధానిని కలిసే అవకాశం కల్పించిన పార్టీ నేతలకు వారు ధన్యవాదాలు తెలిపారు.

తెలంగాణలో బీజేపీ విజయం తథ్యం

జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి



ర్యాలీలో అభివాదం చేస్తున్న లంకల దీపక్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: తెలంగాణలో బీజేపీ విజయం తథ్యమని జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గంలో రోడ్‌షో, బైక్‌ర్యాలీని నిర్వహించారు. వందలాది బైక్‌లతో కార్యకర్తలు ఉత్సాహంతో ర్యాలీలో పాల్గొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీని గెలిపించాలని కోరారు. అరాచకపాలనకు చమరగీతం జరగాలంటే బీజేపీకి ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, ఆలపాటి లక్ష్మీనారాయణ, బంగారు ప్రశాంత్, ప్రేమ్‌కుమార్, బాలకృష్ణ మోహన్, అట్లూరి రామకృష్ణ, శ్రీనివాసగౌడ్, మహిళా నేతలు పాల్గొన్నారు.

ఐపీసీతోనే యువతకు ఉజ్వల భవిత

డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి



మేనిఫెస్టోను ఓటర్లకు వివరిస్తున్న చెన్నారెడ్డి

శ్రీనగర్‌కాలనీ: భవిష్యత్ తరాలు బాగుండాలంటే ఇండియన్ ప్రజా కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి అన్నారు. మంగళవారం శ్రీనగర్ కాలనీ, ఎర్రగడ్డలలో పాదయాత్ర చేస్తూ ప్రచారాన్ని నిర్వహించారు. పార్టీ మేనిఫెస్టోని తెలియజేశారు. ఈల గుర్తుకు ఓటువేసి ఐపీసీ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

పోలింగ్ సామగ్రి తరలింపునకు ఏర్పాట్లు పూర్తి

బంజారాహిల్స్: ఈ నెల 30న జరగనున్న పోలింగ్‌కు సంబంధించి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలోని జూబ్లీహిల్స్ డీఆర్‌సీ సెంటర్‌లో ఎన్నికల సామగ్రి తరలింపు కోసం 40 కౌంటర్లు ఏర్పాటు చేశారు. సెక్టోరియల్ అధికారులు రూట్ ఆఫీసర్లతో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రవి సన్నాహక సమావేశాన్ని నిర్వహించి ఈవీఎంల తరలింపు, ఎన్నికల సామగ్రి తీసుకునే విధానాన్ని వివరించారు. నియోజకవర్గంలో మొత్తం 352 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. సకాలంలో ఈవీఎంలను పోలింగ్ బూత్‌లకు చేర్చడంలో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకం అన్నారు. పోలీసు బందోబస్తు మధ్య రూట్ ఆఫీసర్లు సమయానికి పోలింగ్ బూత్‌లకు ఈవీఎంలు, వీవీప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని చేర్చాల్సిన బాధ్యతను తెలియజేశారు. పోలింగ్ సిబ్బంది, ఈ నెల 29, 30 తేదీల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని విభాగాలను సమన్వయంగా చేస్తూ వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేశామన్నారు. సమస్యలుంటే ఈ గ్రూప్‌లో తెలియజేయాలని ఆయన సూచించారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తి అరెస్ట్

హిమాయత్‌నగర్: సోషల్ మీడియాలో ఫొటోలు పెడతానంటూ ఓ యువతిని వేధిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సైబర్‌క్రైం ఏసీపీ శివ మారుతి తెలిపారు. ఓ యువతి తన ఫొటోలను అసభ్యకరంగా మార్చి ఫేస్‌బుక్‌లో పోస్టు చేస్తానంటూ వేధిస్తున్న వ్యక్తిపై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, మెదక్ జిల్లా జహీరాబాద్‌కి చెందిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించామని ఏసీపీ తెలిపారు.

చుక్క మిగల్లే.. సీస దొరకలే..



ఫిలింనగర్‌లో ఓ వైన్స్ వద్ద రద్దీ

బంజారాహిల్స్: ఈ నెల 30న జరగనున్న పోలింగ్ సందర్భంగా రెండు రోజుల ముందే వైన్‌షాపులు మూసివేయాలని ఆదేశాలు వెలువడటంతో మంగళవారం సాయంత్రం అన్ని వైన్‌షాపులు మూతపడ్డాయి. బుధ, గురువారాల్లో వైన్‌షాపులు తెరవరనే సమాచారం తెలుసుకున్న మందుబాబులు మంగళవారం సాయంత్రం వైన్‌షాపుల వద్ద క్యూలు కట్టారు. ఒక్కసారిగా మద్యం కోసం జనం తరలి రావడంతో దాదాపు అన్నీ షాపులు ఖాళీ అయ్యాయి. కావాల్సిన సరుకు దొరకకపోవడంతో మందుబాబులు ఏదో ఒకటి ఇవ్వండి అంటూ కనిపించిన ప్రతి బాటిల్‌నూ కొనుగోలు చేశారు. ఇదిలా ఉండగా వైన్‌షాపులు మూసివేస్తున్నారన్న సమాచారం పెద్ద ఎత్తున మద్యం కొనుగోలు చేసి వెళ్తున్న వారిని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పట్టుకున్నాయి. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి 18 బీరు సీసాలు పట్టుకొని వెళ్తుండగా వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఇలా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో భారీగా మద్యం పట్టుబడింది.



మధురానగర్‌లో పీఎస్ వద్ద ఉద్రిక్తత

పోలీసులు తీరుపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం

శ్రీనగర్‌కాలనీ: మధురానగర్ పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా వ్యవహిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆందోళకు దిగారు. వివరాలివీ... మంగళవారం మధ్యాహ్నం వెంగళరావునగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో కొంత మంది ఓటర్లకు డబ్బులు పంచుతున్నారనే సమాచారంతో కాంగ్రెస్ నాయకులు అక్కడికి చేరుకుని డబ్బులు పంచుతున్న వ్యక్తిని, డబ్బులను, పోలింగ్ స్లిప్‌లను పట్టుకుని మధురానగర్ పీఎస్‌లో అప్పజెప్పారు. డబ్బులు స్థానిక బీఆర్ఎస్ నాయకుని వాహనంలో ఉన్నాయని అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు అతని వాహనాన్ని సైతం పీఎస్‌కు తరలించారు. అక్కడికి చేరుకున్న కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకుని వాహనం పీఎస్ కొంత దూరంలో నిలిపి ఉండటం పట్ల అనుమానం వ్యక్తం చేశారు. వాహనాన్ని ఎన్నికల అధికారులు, పోలీసులు సమక్షంలో తనిఖీ చేయగా అందులో ఎలాంటి డబ్బులు దొరకలేదు. పోలీస్ స్టేషన్ ముందుంచాల్సిన వాహనం దూరంలో ఎలా పార్కింగ్ చేశారని, అందులోని డబ్బు మాయం అయ్యిందని కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు భవానీశంకర్ తమ అనుచరులతో కలిసి పోలీసులు వాగ్వాదానికి దిగారు. పోలీసులు బీఆర్ఎస్ పార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అదేసమయంలో వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య పోలీస్ స్టేషన్‌కు రావడంతో కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేయడం, బీఆర్ఎస్ నాయకులు సైతం నినాదాలు చేయడంతో పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పంజగుట్ట ఏసీపీ మోహన్ కుమార్ అక్కడికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పి పంపివేశారు.

అదిరిపోయిన కాంగ్రెస్ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో విజయారెడ్డి



ఫిలింనగర్ సొసైటీ సభ్యులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి



ఎన్టీఆర్‌నగర్‌లో జరిగిన పబ్లిక్ మీటింగ్‌లో మాట్లాడుతున్న విజయారెడ్డి

బంజారాహిల్స్: ఎన్నికల ప్రచారం మంగళవారంతో ముగిసింది. ఆఖరి రోజున ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి బల ప్రదర్శన నిర్వహించారు. ఉదయం నారాయణగూడ మేల్కొటే పార్కు వద్ద ప్రారంభమైన బైక్ ర్యాలీ నియోజకవర్గ నలుమూలలను తిరుగుతూ ఎంఎస్‌మక్తాలో ముగిసింది. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ... నెల రోజులుగా జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో తనకు అడుగడుగునా జనం నీరాజనాలు పట్టారన్నారు. తనలో నియోజకవర్గం ప్రజలు పీజేఆర్‌ను చూసుకుంటున్నారని ఇది తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు. పీజేఆర్‌ను ఎలా గెలిపించుకున్నారో తనను కూడా అలాగే గెలిపించుకొని నియోజకవర్గంలో పీజేఆర్‌ను చూసుకోవాలని కోరుకుంటున్నారని వెల్లడించారు. ప్రజలు ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రచారంలో తెలుసుకోవడం జరిగిందన్నారు. బైక్ ర్యాలీ విజయవంతం కావడంపట్ల తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలి రావడంతో ఆ పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేశారు.

ఆర్భాటంగా దానం బైక్ ర్యాలీ





బైక్ ర్యాలీలో బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలనే ఉద్దేశంతో సుమారు 12 వేల నుంచి 15 వేల మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వబోతున్నామని ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ స్పష్టం చేశారు. సమాఖ్య సంఘాలకు 40 వేల ఇళ్లు ఇవ్వాలని సీఎం కేసీఆర్ చెప్పారన్నారు. ప్రచారం ఆఖరి రోజున మంగళవారం ఉదయం 10 గంటలకు ఫిలింనగర్ మహనీయుల చౌరస్తా నుంచి భారీ బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు వెల్దండ వెంకటేష్, మన్నె కవితారెడ్డి, మహాలక్ష్మి రామన్‌గౌడ్, సంగీతా యాదవ్, మాజీ కార్పొరేటర్లు కృష్ణ యాదవ్, బి. భారతినాయక్, మామిడి నర్సింగ్‌రావు తదితరులతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా 200 మందికి పైగా నేతలు ఈ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.




ప్రచార రథంలో దానం, మేయర్..

ఆర్భాటంగా నిర్వహించిన ఈ బైక్ ర్యాలీ ద్వారా నాగేందర్ తన బలాన్ని నిరూపించుకున్నారు. ఈ ఎన్నికల్లో తనకు 50 వేల పైచిలుకు మెజార్టీ ఖాయమని దానం ధీమా వ్యకం చేశారు.

ప్రచార రథాలకు వీడ్కోలు!

ఫిలింనగర్: ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం ముగిసింది. గల్లీగల్లీలో మైకులు మూగబోయాయి. బీఆర్ఎస్ ఖైరతాబాద్ అభ్యర్థిగా దానం నాగేందర్‌ను, జూబ్లీహిల్స్ అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్‌ను నెల ముందే ప్రకటించడంతో ముందస్తుగానే ప్రచారంలో దూకారు. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత కాంగ్రెస్, బీజేపీ తమ అభ్యర్థులను ప్రకటించింది. ఆలస్యంగా అభ్యర్థుల ప్రకటనతో వీరికి ప్రచారానికి 20 రోజుల గడువు మాత్రమే దొరికింది. బీఆర్ఎస్ అభ్యర్థుల తరపున మంత్రి కేటీఆర్, బీజేపీ అభ్యర్థి తరపున కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, గోవా సీఎం, కేంద్ర మంత్రు నిర్మలాసీతారామన్, స్మృతి ఇరానీ ప్రచారం నిర్వహించగా సోమవారం ప్రధాని మోదీ ఖైరతాబాద్ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డికి మద్దతుగా రోడ్‌షో నిర్వహించారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి అజహరుద్దీన్‌కు మద్దతుగా రాహుల్‌గాంధీ ప్రచారం నిర్వహించారు. ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ప్రజా ఆశీర్వాద సభల ద్వారా సఫలీకృతం అయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి ప్రచారంతో ప్రత్యర్థులకు చెమటలు పట్టించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


ఖైరతాబాద్ అభివృద్ధికి పాటుపడే వారిని,
మీకు అందుబాటులో ఉండేవారిని
అసెంబ్లీకి పంపించండి
1 చింతల రామచంద్రారెడ్డి
2
3
4
5
6
7
పోలింగ్ తేది :
30 నవంబర్, 2023
సమయం :
ఉ. 7 గం.ల నుండి
సా. 5 గం.ల వరకు
బిజెపికి ఒక్క అవకాశం ఇవ్వండి...ఖైరతాబాద్ రూపురేఖల్ని మనమంతా కలిసి మార్చుదాం. అధికార, ధన బలంతో కాదు ప్రజాబలంతో ముందుకెళ్తున్న నన్ను మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించండి
కమలం పువ్వు
గుర్తుకు ఓటేద్దాం
చింతల రామచంద్రారెడ్డి
ఖైరతాబాద్ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి